చిన్నకథ

రామ చిలుక

శ్రీ కె. సభా

"ఊరనో అడివినో నెరుపునో నేలనో
ఎప్పుడో ఎక్కడో నిలకా!
సాపు సత్తెంబని సాములు నెప్పేరు
సత్తెమంతే రామ నిలకా!
కొంచెమో నంచమో కోడిళ్లు కూతుళ్లు
మంచి నేమెల్లతో నిలకా
దానాలు నెయ్యాలనేమ్మాలు నెయ్యాలి
పంచభక్షంగుల రామ నిలకా!"

ఈ పాటనే ఆలాపిస్తున్నాడు బిచ్చగాడు. ఆ చిరిగిన చొక్కా....తియలు కట్టిన వెంట్రుకలు, వీటిమీద ఆడుతుంటున్న చిలుక చూస్తున్న కొద్దీ ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని యిస్తూన్నై. అందుకే అతని వెంబడీ పిల్లలు చుట్టుకున్నారు.

బిచ్చగాడు వెడుతూ వెడుతూ మేడ ముందు ఆగాడు. మేడమీద వసారాలో కూచున్న శ్రీమతి క్రిందికి చూచింది. బిచ్చగాడి భుజాలమీద యెగురులాడుతున్న చిలుక బిచ్చగాడు విలిపిన పాటను అందుకున్నది.

"మానవో ననినినో నెనునునో సేననో
నెన్నునో నెన్నునో నినన
నాను నన్నెంనని నానున్ను నెన్నేను —
నన్నె నంచే నాన నినా!"

విజంగా ఈ పలుకులు ఎంత బాగున్నవి! శ్రీమతి చరచరా మేడమెట్లుదిగి క్రిందికి వచ్చింది. బిచ్చకాని భుజంమీదవున్న చిలుకను పట్టుకొన్నది. అది రెపరెపమంటూ రెక్కలు కొట్టుకొని ఆమె చేతులను ముక్కుతో పొడిచివేసింది. ఆమె ఓర్చుకోలేక విడిచివేసింది. వెంటనే బిచ్చగానిపై

"ఈ చిలక నా తల్లి! అదే నా పంచ పాణాలు! దీన్ని విడిస్తే నేను బతకలేనమ్మా! నన్ను విడిస్తే అదికూడా బతకదమ్మా"

అన్నాడు ముసలాడు. "అంత కష్టమెందుకు తాతా నీకు. నేను నీకంటె బాగా చూచుకుంటాను. బంగారు పంజరంలో పండ్లు తింటూ హాయిగా వుంటుంది. నీవుగూడా అప్పుడప్పుడూ వచ్చి పాటలు నేర్పుతూ వుండు. ఎంత కావాలి చెప్పు" అన్నది శ్రీమతి. "గొప్పిందోళ్ళు మీ రలా అంటే బావుండదమ్మా! నేను బతకాలా? వద్దా? నా నిలక నిడిస్తే నేను బతకనేలేను. ఆ ఏడుకొండల వాడి సాక్షిగా తల్లీ" అన్నాడు ముసలాడు.

ఈలోగా బ్రహ్మయ్య బయటికి వచ్చారు. "ఏవిటమ్మా బేరం?" అన్నాడు కూతుర్ని. "చిలక నిమ్మన్నాను నాన్నా ధర మాట్లాడుతున్నాను" అన్నది. శ్రీమతి. "ఎంతరా?" అన్నాడు బిచ్చగాని వంక చూస్తూ!

"నే నిస్తానని చెప్పలేదు బాబూ!" అన్నాడు బిచ్చగాడు.

"పోనీలేరా ఒకరూపాయ తీసుకో" అన్నాడు బ్రహ్మయ్య.

"నే నివ్వను బాబూ!" సమాధానం.

"ఏరా చిలకలు ఎక్కడా దొరకవనా? ఏదో అమ్మాయి కావాలంటున్నది. ఇచ్చి ఇంకోటి పట్టుకో లేకపోయావూ?"

"దీన్ని యివ్వను సామీ!"

"ఐతే రెండుగా తీసుకో."

"మన్నించాలి దొరా! దీన్ని అమ్మడానికి లేదు."

"పర్వాలేదులే....మా మావిడి తోటలో నేరేడు చెట్లో దండిగా వున్నాయి. కావలసి వుంటే రెండు పట్టుకుని పోరా!"

"నా తెందుకుసామీ?.

"ఒరేయ్ ఎన్నిసార్లుగా..మహా చిలుకను చూశావు ఇంకెక్కడా దొరకదనుకున్నావా" అన్నాడు బ్రహ్మయ్య కోపంగా.

ఆ మాట అంటుండగానే అప్పుడే వచ్చిన రవణయ్య "ఒరేయ్ ముసలాడా, బాబయ్య అడిగింది గొప్పగానీ నీవు ఇచ్చేది గొప్ప బాతుందారా..అరకాసు చిలుక్కోసం ఏమో గిరాకి చేసుకుంటున్నావు" అని గద్దించాడు.

"ఎందుకు బాబూ కోపం. నేను అమ్మడానికి తెచ్చానా" అన్నాడు బిచ్చగాడు.

"నువ్వు తెచ్చావని ఎవరన్నా రివుకు? కావలసివుంటే ఇంకో రూపాయ తీసుకెళ్ళరా" అన్నాడు బ్రహ్మయ్య.

"ఒక్క రూపాయ కాదు బాబూ ఎయ్యి రూపాయ లిచ్చినా యివ్వను. నన్ను విడిసి పెటండి సామీ! [illegible]

"నె నమన్నాను బాబూ!" అన్నాడు బిచ్చగాడు.

"ముందు ఆ చిలకను యిలా ఇవ్వు" అంటూ రవణయ్య అమాంతంగా వెళ్ళి చిలకను పట్టుకొన్నాడు. బిచ్చగాడు "బాబో,బాబో!"అని మొత్తుకుంటుంటే చిలక రవణయ్య చేతుల్ని చితకకొడిచింది. రవణయ్యకు కోపం ముంచుకువచ్చి చిలక కాలిని పట్టుకున్నాడు. చిలక క్రిందికి వ్రేలాడడంలో వ్రేలు విరిగిపోయింది. అది కెవ్వుమంటూ వచ్చి బిచ్చగాని మీద వాలిపోయింది. బిచ్చగాడు దానిని దువ్వుతూ వ్రేలిని చూచి, "అయ్యో, రామా!"

అంటూ గుడ్డపేలిక చించి ముంతలో నీళ్ళలో తడిసి కాలికి చుట్టాడు.

దీన్నంతా చూస్తున్న శ్రీమతి "వద్దులే తాతా! నెళ్ళు" అన్నది. బిచ్చగాడు వెడుతుంటే రవణయ్య "ఏరా వెడుతున్నావ్ వెధవా!" అంటూ లేచాడు. పోనీ లే రవణయ్య, అమ్మాయిగూడా వద్దన్నది. వాడికో నేం లే అడుక్కుతినేవాడు" అన్నాడు. బిచ్చగాడు వెళ్ళిపోయాడు.

2

చిలక కాలివ్రేలు బాగానే విరిగింది. ముసలాడు పాపం ఎంతో బాధపడ్డాడు. ఎర్ర మట్టితో తడిసిన గుడ్డ పేలికను చుడుతూ వచ్చాడు. అదృష్టం మంచిది గనుక వ్రేలు బాగైపోయింది. బాగైందని అనుకొన్నా ఎప్పుడైనా ఆ వ్రేలికి రవ్వంత దెబ్బ తగిలితే ప్రాణం పోయేటంత పనైపోయేది. అది బాధకు అల్లాడుతుంటే ముసలాడు మరీ బాధపడేవాడు. రోజూ ఉదయం బయలుదేరితే సాయంకాలం వరకూ బిచ్చ మెత్తుకొని చీకటి పడగానే ఆ ఊరి మొగదల కుంట గట్టున మర్రిచెట్టు క్రిందికి వచ్చేవాడు. తాత వక్షస్థలం మీద చిలుక పడుకొనేది. ఎక్కువ చలిగా వుంటే తోలెలో దూరుకుంటుంది. లేదా చిరిగిన చొక్కాలో ఆణుక్కొంటుంది. ఉదయం లేచిందే భుజంమీద వుంటుంది. తాతకు ఆయాసం వచ్చినా; తల నొచ్చినా; ముక్కు నొచ్చినా చిలుక తెలుసుకొనేది. ఆ రోజంతా మాటి మాటికి తాత ముఖంపైవు తొంగి చూస్తూ వుండేది.

చిలుకను తాత "రామా" అంటూ ఆప్యాయంగా పిలిచేవాడు. తాతను చిలుకగూడా 'నా నా' అంటూ పలకరించేది.

"నాన"పాడే ప్రతిపాటా "రాము"కు తెలుసు. "రాము"కు నేర్పకుండా "నాన" ఒక పాట గూడా దాచుకోలేదు. తంబుర మీటతో పాటు "రాము" వలుకులు శ్రుతులు గలిసితే "నాన" పాడుతుంటే ఆ పాట నెలయేటి చిరు తరంగాల వసంత గానంలా మధురాతి మధురంగా వుండేది. "నాన" జీవితమంతా ఈలాగే గడచి పోతున్నది. "నాన" ఆ గ్రామానికి వచ్చి దాదాపు ఆ రేడు మాసాలైనై. ప్రతి రోజూ రాత్రి ఆ మర్రిచెట్టు క్రిందే వున్నాడు. వగలు చుట్టు ప్రక్కల గ్రామాలలో పాడుతూ బిచ్చమెత్తుకుంటాడు. అలా జరుగుతున్న జీవితంలో ఆ నుకోని విధంగా జరిగిన ఈ సంఘటన "నాన" కు చాలా బాధ గల్గించింది. "రాము" కు వ్రేలు విరిగిందంటే "నాన" వ్రేలు విరిగినట్టే గదా! ఏలాగో ఆ గండం గడిచి గట్టెక్కాడు "నాన".

3

ఓ నాడు రాత్రి పండంటి వెన్నెల. "నాన" చెట్టుక్రింద పరుకున్నారు. "రాము" రొమ్ము మీద [illegible] "నాన" పాట [illegible]:

ఒస్తావా మావూరు నెందమావా!
సుక్కల్లో నెందమావా
సక్కన్నీ నెందమావా
ఒక్కసారి నెందమావా

ఒస్తావా మావూరు నెందమావ!

"రాము" ఒక్కొక్క అడుగుగా అందుకున్నది.

"నెన్నెన్నో నెంన నానా
నన్నున్నో నెంన నానా" అని.

పాట ముగిసిందే "నాన" నిద్రపోయాడు. "రాము"కు వెన్నెల చూస్తుంటే నిద్ర పట్టలేదు. రాగం తీస్తూనే వుంది. ఈలోగా ఎక్కడనుంచో "బుస్"మని శబ్దం వచ్చింది. 'రాము' వెంటనే "నాన నాన నాను నాను" అని అరచింది. 'నాన'కు మెలకువ రాలేదు. మూతిమీద రెక్కలతో రెపరెపమంటూ కొట్టింది. కాళ్ళతో గీరినా "జిజ్జిపో రాము" అంటూ పొర్లుకున్నాడో లేదో కన్ను మని కాటేసింది. తాచుపాము. రాము ఎగిరి దూరంగా పడిపోయింది. "అమ్మో! అంటూ భుజం పట్టుకొని పైకి లేచాడు "నాన,"పాము వెళ్ళిపోయింది. 'రాము' వచ్చి భుజంమీద వాలింది. "రాము" అంటూ దువ్వుతూ.... తూలిపోయాడు "నాన."

ఈళ్లో ఎవరో పాముకు కాటుకు మంత్రం వేస్తారని "నాన" విన్నాడు.. అందుచేత పైకిలేచి అతి ప్రయత్నంమీద నాలుగు బారలు నడిచాడో లేదో "నాన" సృహతప్పి క్రింద పడిపోయాడు.

"రాము" తూలి దూరంగా పడి "నాన, నాన" అని కొట్టుకొన్నది. ..."నాన" పలకలేదు. మళ్ళీ ఎంత ప్రయత్నించినా పలకలేదు. ముక్కుమీద పొడిచినా కదలలేదు. ఒట్ల చల్లగా వుందని "రాము"కు తెలిసింది....చెవ్వు దగ్గర గట్టిగా పిలిచింది. ఊహూ....ఎంత అరచినా "నాన" వలకనే లేదు. మెదలనే లేదు.

చివరికి "రాము"కు తెలిసి పోయింది "నాన" చచిపోయాడని. "నానో నానో నానో" అని గట్టిగా యేడ్చింది. "నాన"మీద తొలిగిపోయిన బట్టను సవరించింది. ముఖంమీద తోలెలోనున్న గుడ్డ పేలికలను ముక్కుతోలాగి తప్పి పెట్టింది. ఆ రాత్రి పూర్తిగా "నానో.... నానో...." అంటూ అరుస్తూ ఆ శవంమీద రెక్కలతో తప తపమని కొట్టుకొంటూ వుండిపోయింది.

తెల్లవారింది. దారిలో వెడుతున్నవారందరూ ఆ దృశ్యాన్ని చూచి ఆశ్చర్యంతో కన్నీరు విడిచారు. ఆ శవమూ, దానికి నాలుగు బారల్లో తోలె....దానిదగ్గరే తంబురా....వాటిని చూస్తేనే ప్రతివారి గుండెలు కరిగిపోయినై. "రాము" ఆ శవంమీదనుండి తోలెమీదికి.... తోలెమీదనుండి తంబురమీదకూ, తంబుర మీదనుండి మళ్ళీ శవంమీదకూ వాలుతూ వుంది. రాత్రల్లా అరిచి ఏడ్చి ఏడ్చి గొంతు బొంగురు పోయిం దేమో పాపం స్వరం గూడా సరిగా రావడం లేదు.

జనం ఎక్కువైనప్పుడు ఆ మర్రిచెట్టు పైకి ఎగిరి కూచుంటుంది గానీ మళ్ళీ ఆశే వదలదు. వార